అభివృద్ధికి ఆమడ దూరంలో గన్నారం


2


2
జాతీయ రహదారిపై దారిదోపిడీ

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

12-7-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## నవోదయకు ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల

**అక్షరటుడే, నిజాంసాగర్:** నిజామాబాద్‌లో నూతనంగా ఏర్పాటైన నవోదయ విద్యాలయంలో ప్రవేశాల ప్రక్రియను ప్రారంభించారు. ఇందులో భాగంగా ఎంపికైన విద్యార్థుల జాబితాను శనివారం ప్రకటించారు. 6వ తరగతిలో ప్రవేశాల కోసం మొత్తం 40 మందిని ఎంపిక చేసినట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ మను యోహన్నన్ తెలిపారు.

**14వ తేదీ నుంచి అడ్మిషన్లు..**

నవోదయలో ఈనెల 14వ తేదీ నుంచి అడ్మిషన్లు ప్రారంభించనున్నట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఇప్పటికే సమాచారం ఇచ్చినట్లు స్పష్టం చేశారు. సోమవారం నుంచి సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నట్లు చెప్పారు.



## ఊరపండుగకు సర్వం సిద్ధం..

ఊరంతా మెచ్చే ఊర పండుగ వచ్చేసింది.. అమ్మను కొలిచేందుకు ఇందూరు సర్వసమాజం సన్నద్ధమైంది. జిల్లా కేంద్రంలో ఏటా ఆషాఢ మాసంలో పౌర్ణమి తర్వాత వచ్చే ఆదివారం ఊరపండుగను ఘనంగా జరుపుకుంటారు. దేవతలను ఊరు నలుమూలల ప్రతిష్ఠించి భక్తితో కొలుస్తారు. పండుగ కోసం సర్వసమాజ్ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. అమ్మవారి విగ్రహాల తయారీ పూర్తయింది. అలాగే ఖిల్లాలో శారదాంబ గద్దె వద్ద ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం ఊరేగింపు నిర్వహించనున్నారు. - అక్షరటుడే, ఇందూరు



## బాన్సువాడ నుంచి మహారాష్ట్రకు ప్రత్యేక బస్సు

**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ నుంచి మహారాష్ట్రలోని పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు నడపనున్నట్లు డీఎం సరితా దేవి తెలిపారు. ఈనెల 20న సూపర్ లగ్జరీ బస్సును నడిపించనున్నట్లు పేర్కొన్నారు. యాత్రలో భాగంగా పర్లీ వైద్యనాత్, అంబాజోగాయ్, పండరిపూర్ విఠలేశ్వర్ మందిరం, షోలాపూర్, తుల్జాపూర్ భవానీ మాత దర్శనం ఉంటుందన్నారు. 20న ఉదయం 6 గంటలకు బస్సు బాన్సువాడ నుంచి బయలుదేరుతుందని తెలిపారు. మరుసటి రోజు (21న) సాయంత్రం 6 గంటలకు తిరిగి బాన్సువాడకు చేరుకుంటుందని వివరించారు. టికెట్ ధర పెద్దలకు రూ. 2,200, పిల్లలకు రూ.1,100 ఉంటుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్లని కోరారు. టికెట్స్ కోసం గోపికృష్ణ 9063408477ను సంప్రదించాలని సూచించారు.

## 15న ఆర్మూర్ నుంచి భద్రాచలానికి..

**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆర్మూర్ డిపో నుంచి భద్రాచలానికి ప్రత్యేక బస్సు నడపనున్నట్లు డీఎం రవికుమార్ తెలిపారు. ఈనెల 15న రాత్రి 9 గంటలకు డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్ సర్వీసు ప్రారంభమవుతుందని, తిరుగు ప్రయాణంలో సమ్మక్క, సారలమ్మ, రామప్ప వేయి స్తంభాల గుడి, భద్రకాళి అమ్మవారిని దర్శించుకోవచ్చన్నారు. తిరిగి 17న ఉదయం 8గంటలకు ఆర్మూర్‌కు బస్సు చేరుకుంటుందని పేర్కొన్నారు. పెద్దలకు రూ.1900 బస్ టికెట్ ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## దివ్యాంగుల జిల్లా సదస్సు విజయవంతం చేయాలి



**అక్షరటుడే, బోధన్:** జిల్లా కేంద్రంలో ఈనెల 18న దివ్యాంగుల జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సదస్సుకు ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు భూమయ్య, పోచీరాం, చంద్రయ్య, భూమయ్య పాల్గొన్నారు.

కామారెడ్డి జిల్లా రాజకీయాలు మరోసారి రచ్చకెక్కాయి. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలు బహిర్గతమవుతూనే ఉన్నాయి. గతంలో ఉన్న గ్రూపులకు తోడు ఇప్పుడు మరొక గ్రూపు తయారైనట్టుగా తెలుస్తోంది. – అక్షరటుడే, కామారెడ్డి



# కామారెడ్డి కాంగ్రెస్‌లో రచ్చకెక్కిన విభేదాలు

■ చేయి దాటుతున్న నేతలు.. ■ అధిష్టానానికి ఫిర్యాదులు ■ 'స్థానిక' ఎన్నికల వేళ కొరవడిన సమన్వయం

జిల్లా కాంగ్రెస్‌లో గ్రూపులు తయారు కావడంతో ముఖ్య నాయకులంతా టీపీసీసీ చీఫ్‌ను కలిసి పార్టీ పరిస్థితిపై మొరపెట్టుకున్నట్టు వినిపిస్తోంది. పార్టీ ప్రతిష్టను దిగజార్చే నాయకులను సస్పెండ్ చేయాలని కోరడం చర్చనీయాంశంగా మారింది.

పదేళ్ల తర్వాత అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ పార్టీకి కామారెడ్డి జిల్లా రాజకీయాలు తలనొప్పిగా మారాయి. ఇక్కడి నేతల గ్రూపు రాజకీయాలతో పార్టీ ప్రతిష్ట మసకబారుతుందన్న ప్రచారం సాగుతోంది. ఇప్పటికే పదవుల పంపకాలలో వచ్చిన వివాదం గాంధీ భవన్ వరకు చేరింది.

ప్రత్యేకించి నియోజకవర్గ నేతలు వ్యవహరిస్తున్న తీరును ఇదివరకే కొందరు నాయకులు పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. కాగా.. ఇటీవల కామారెడ్డి నియోజకవర్గంలో జరిగిన పలు పరిణామాలు పార్టీ ముఖ్య నేతల్లో అంతర్గతంగా ఉన్న విభేదాలను ఒక్కసారిగా బయటపెట్టాయి.

**చంద్రశేఖర్ రెడ్డి అరెస్టుతో..**

కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ భర్త గడ్డం చంద్రశేఖర్ రెడ్డి అరెస్టుతో నియోజకవర్గంలో తీవ్ర చర్చ మొదలైంది. అక్రమంగా పేలుడు పదార్థాలు కలిగి ఉన్న కేసులో నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు కామారెడ్డి పట్టణ పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారు. తీరా బెయిల్‌పై బయటకు వచ్చారు.

కాగా.. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీని ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. తన అరెస్టుకు సదరు నేత కారణమంటూ ఘాటుగా స్పందించారు. రాజకీయ కుట్రలో భాగంగానే తనను పేలుడు పదార్థాల కేసులో అరెస్ట్ చేశారని, దీని వెనుక కామారెడ్డికి చెందిన ఓ పెద్దాయన హస్తం ఉందని ఆరోపించారు. ఓ 70 ఏళ్ల పెద్దమనిషి వెనకుండి మరీ ఇదంతా నడిపిస్తున్నారని షబ్బీర్ అలీని ఉద్దేశించి ఆరోపణలు గుప్పించారు. ఈ విషయాన్ని పార్టీ హైకమాండ్ దృష్టికి కూడా తీసుకెళ్లానని, పార్టీ తన పట్ల సానుకూలంగా ఉందన్నారు. తనపై కుట్రలు చేసిన పెద్దమనిషి, అతని కొడుకు, తమ్ముడు, అన్న కొడుకు అందరి వివరాలు తనవద్ద ఉన్నాయని, అవసరం వచ్చినప్పుడు ఆధారాలతో సహా వారిపై పార్టీ హైకమాండ్ కు ఫిర్యాదు చేస్తానని చెప్పడం కామారెడ్డి రాజకీయాల్లో దుమారం రేపుతోంది.

**అధిష్టానానికి ఫిర్యాదు..**

మరోవైపు చంద్రశేఖర్ రెడ్డి తీరుపై పార్టీ నేతలు కొందరు గుర్రుగా ఉన్నారు. ఆయనపై టీపీసీసీ చీఫ్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. తాజాగా నెలకొన్న వివాదాలతో పార్టీకి చెడ్డపేరు వస్తోందని, పార్టీ ప్రతిష్ఠను దిగజార్చే నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరారని తెలిసింది. లేనిపక్షంలో తాము మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని.. షబ్బీర్ అలీ వర్గీయులు పార్టీ నాయకత్వానికి తేల్చి చెప్పినట్టుగా సమాచారం.

**స్థానిక ఎన్నికల వేళ..**

అతిత్వరలోనే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తు చేస్తోంది. ఇలాంటి తరుణంలో పార్టీ ముఖ్య నేతలు, నాయకులు సమన్వయంతో పనిచేయాల్సి ఉంది. కాగా.. కామారెడ్డి జిల్లాలో మాత్రం అందుకు పూర్తి భిన్నంగా వారి వ్యవహారశైలి ఉంది. ఈ నేపథ్యంలో పార్టీ హైకమాండ్ సైతం తాజా పరిణామాలను సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే జిల్లా నేతలందరితో పీసీసీ చీఫ్ భేటీ నిర్వహించే అవకాశం ఉంది.

## గాంధారి పోలీస్‌స్టేషన్ తనిఖీ



పోలీస్ స్టేషన్‌లో రిజిస్టర్లను పరిశీలిస్తున్న డీఎస్పీ

**అక్షరటుడే, గాంధారి:** గాంధారి పోలీస్‌స్టేషన్‌ను ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, నేర వివరాలు, కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కేసుల పరిశోధన, పరిష్కారానికి పలు సూచనలు చేశారు. ఫిర్యాదుదారులకు అందుబాటులో ఉంటూ, బాధితులకు న్యాయం చేసేలా విధులు నిర్వహించాలన్నారు. అంతకుముందు ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది డీఎస్పీకి గౌరవ వందనం చేశారు. ఆయన వెంట సదాశివనగర్ సీఐ సంతోష్ కుమార్ ఉన్నారు.




## డెంగీ కలకలం.. ఒకే గ్రామంలో 20 మందికి పాజిటివ్

**అక్షరటుడే, కామారెడ్డి:** పాల్వంచ మండలంలో డెంగీ విజృంభిస్తోంది. ఒకే గ్రామంలో 20 మందికి పాజిటివ్ రావడం ఆందోళన కలిగిస్తోంది. భవానీపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కిసాన్‌నగర్‌లో డెంగీ కేసులు కలకలం రేపుతున్నాయి. కాలనీలో గత 15 రోజులుగా పలువురు జ్వరంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వైద్యులు రెండు మూడు రోజులుగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ టెస్టుల్లో సుమారు 20 మందికి డెంగీ పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. అందులో చిన్నారులు, వృద్ధులు సైతం ఉన్నారు. డెంగీ సోకిన వారు కొందరు జీజీహెచ్, మరి కొందరు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. డెంగీ లక్షణాలు ఉన్నవారికి గ్రామంలోనే వైద్యులు మందులు అందజేస్తున్నారు. దోమల వ్యాప్తి వల్లనే డెంగ్యూ సోకినట్టుగా ప్రజలు చెబుతున్నారు. దీంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సిబ్బంది డ్రెయినేజీలు, రోడ్లను శుభ్రం చేస్తున్నారు. వైద్య సిబ్బంది కాలనీలోనే ఉంటూ డెంగీ బాధితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. కాలనీలో ప్రత్యేకంగా హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## కనుల పండువగా శ్రీవారి కల్యాణం

**అక్షరటుడే, ఇందూరు:** నర్సింగ్‌పల్లిలోని ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రంలో శ్రీవారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం ఈ వేడుకను జరిపించారు. వేద పండితులు సంపత్ కుమారాచార్య, ప్రధానార్చకులు రోహిత్ కుమార్ ఆచార్య ఆధ్వర్యంలో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. కార్యక్రమంలో ఆలయ సేవకులు నరాల సుధాకర్, నర్సారెడ్డి, రామ్మోహన్, సాయిలు, మురళి, పృథ్వీ, విజయ్ స్వామి, అనిల్ స్వామి, మహేష్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

## వడ్డేపల్లి బీపీఎం సస్పెన్షన్

అక్షర టుడే కథనానికి స్పందన

**అక్షరటుడే, నిజాంసాగర్:** మండలంలోని వడ్డేపల్లి బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు ఆమెను సస్పెండ్ చేసినట్లు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సుజిత్ తెలిపారు. సదరు బీపీఎం అక్రమాలకు పాల్పడడంతో ఈ విషయమై ఈనెల 10న 'అక్షర టుడే'లో కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన అధికారులు శనివారం వడ్డేపల్లి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని పోస్టల్ కార్యాలయంలో ఖాతాదారులు, జమ చేసిన మొత్తం, ఖాతాల్లో జమకాని మొత్తం, తదితర వివరాలపై ఖాతాదారులను ఆరా తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీపీఎంను ఈనెల 11న సస్పెండ్ చేశామని, ఖాతాదారుల నుంచి ఎంతమొత్తం డబ్బులు తీసుకున్నారో వివరాలు సేకరిస్తున్నట్లు వెల్లడించారు. వారి వెంట ఎంవో వెంకట్రాంరెడ్డి, వడ్డేపల్లి ఇన్‌చార్జి బీపీఎం శశికాంత్ ఉన్నారు.





## గెలిచిన వారిపై బాధ్యత పెరిగింది: ధన్‌పాల్

**అక్షరటుడే, ఇందూరు:** పట్టణ ఆర్యవైశ్య సంఘంలో గెలిచిన వారిపై బాధ్యత మరింత పెరిగిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన ఆర్యవైశ్య పట్టణ సంఘం, అనుబంధ సంఘాల అధ్యక్షులు శనివారం ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఆయా ప్రతినిధులను ఎమ్మెల్యే అభినందించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేసి సంఘం అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. అనంతరం పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ధన్‌పాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. తమ గెలుపులో కీలకంగా వ్యవహరించిన ఆర్యవైశ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అనుబంధ సంఘాల అధ్యక్షులు ఇంగు శివప్రసాద్, పాల్తి రవికుమార్, ఇల్లందు సుధాకర్, లిఖిత్, వివేకానంద, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి ఆమడదూరంలో గన్నారం

■ పేరుకే మేజర్ గ్రామ పంచాయతీ ■ నిధులున్నా నిలిచిన అభివృద్ధి పనులు ■ డిగ్రీ కళాశాల, ఫైర్‌స్టేషన్ నిర్మాణాలు కలేనా..

**ఇందల్వాయి మండలం గన్నారం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. పేరుకు మేజర్ పంచాయతీ అయినా.. కనీస సౌకర్యాలు కరువయ్యాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ భవనం కూడా లేదని.. అంగన్‌వాడీ భవనాల్లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు.**

**– అక్షరటుడే, ఇందల్వాయి**



రూరల్ నియోజకవర్గంలో మేజర్ జీపీల్లో గన్నారం ఒకటి. అయితే మిగతా జీపీలతో పోలిస్తే అభివృద్ధిలో మాత్రం వెనకబడి ఉంది. గ్రామంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 4,829 జనాభా ఉండగా 3,905 మంది ఓటర్లు ఉన్నారు. గ్రామంలో రెండు ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి.

**మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి దత్తత తీసుకుని..**


గన్నారం గ్రామాన్ని బాజిరెడ్డి గోవర్ధన్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో దత్తత తీసుకొని 44వ జాతీయ రహదారి గన్నారం నుంచి సిర్నాపల్లి వరకు డబుల్ రోడ్డు వేయించారు. గ్రామంలో పీహెచ్‌సీ నిర్మింపజేశారు. డబుల్ రోడ్డు వేసినప్పటికీ గన్నారం ముఖద్వారం వద్ద ఉన్న చిన్నవాగు వంతెన నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వారాంతపు సంతలో ఎలాంటి సౌకర్యాలు లేవు. గత ప్రభుత్వ హయాంలో డిగ్రీ కళాశాల కోసం నిధులు మంజూరైనా నిర్మాణానికి నోచుకోలేదు. ప్రస్తుతం ఆ స్థలం కబ్జాకు గురైందని గ్రామస్థులు చెబుతున్నారు. ఫైర్‌స్టేషన్ మంజూరైనా కొంత భవనం లేక అద్దెభవనంలో కొనసాగుతోంది. ఇక డబుల్ బెడ్ రూం ఇళ్లు పునాది దశలోనే నిలిచిపోయాయి. జీపీలో ప్రజలు మిషన్ భగీరథ నీటికి నోచుకోలేకపోతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలకు నిధులు మంజూరైనా నిర్మాణాలు జరగలేదు. జీపీకి కొత్త భవనం నిర్మించేందుకు పాత దానిని కూల్చేశారు. కానీ నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## సొంత డబ్బులు ఖర్చుపెట్టా..



గ్రామాభివృద్ధికి నా సొంత డబ్బులు ఖర్చు పెట్టాను. వాటర్ ట్యాంక్ రిపేర్లు, శానిటరీ పనులు, డ్రెయినేజీ తదితర పనుల కోసం ఖర్చు చేశాను. ప్రభుత్వం నుండి సుమారు రూ. 2 లక్షలకు పైగా బిల్లులు రావాల్సి ఉంది. ఎంపీ అర్వింద్ సహకారంతో ఆరోగ్య కేంద్రం చుట్టూ ప్రహరీ నిర్మాణం, గ్రామంలో రెండు హైమాస్ లైట్లు ఏర్పాటు చేశాం. **– కుంట మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్, గన్నారం**

## గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం..



రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం. గ్రామ సమస్యలపై ఇప్పటికే ఎమ్మెల్యేకు నివేదిక అందజేశాం. త్వరలో చిన్న వాగుపై వంతెనతో పాటు ప్రభుత్వ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం.. మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఎమ్మెల్యే సహకరిస్తానని హామీ ఇచ్చారు.

**– గాండ్ల బైరయ్య, కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్**

## మాలల ఆత్మీయ సమ్మేళనానికి మంత్రికి ఆహ్వానం



**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడలో ఈనెల 27న నిర్వహించే మాలల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈమేరకు బాన్సువాడ మాల సంఘం నాయకులు శనివారం హైదరాబాద్‌లో ఉపాధి, కార్మిక, భూగర్భ గనుల మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని కలిశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేయాలని ఆహ్వానించినట్లు మాల సంఘం తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపకుడు అయ్యల సంతోష్ తెలిపారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మాల సంఘం సీనియర్ నాయకులు మల్లూరు సాయిలు, గౌడి నర్సింలు, బాల సాయిలు, బేగరి గంగాధర్, మక్కాయి లక్ష్మణ్ ఉన్నారు.

## రిజర్వేషన్లు అమలు చేసినప్పుడే బీసీలకు న్యాయం



**అక్షరటుడే, ఇందూరు:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పూర్తి స్థాయిలో అమలు చేసినప్పుడే న్యాయం జరుగుతుందని జాతీయ బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రతాప్ అన్నారు. నగరంలోని రోడ్లు భవనాల శాఖ గెస్ట్ హౌస్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీల కోసం 40 ఏళ్ల నుంచి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అనేక ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. దీని ఫలితమే స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు విఠల్, గణేష్ యాదవ్, అఖిల్, రమేష్, జనార్ధన్, శేఖర్, శ్రీను, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు రిజర్వేషన్లపై సీఎం నిర్ణయం హర్షనీయం



**అక్షరటుడే, లింగంపేట:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడానికి కేబినెట్ ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు కాంగ్రెస్ బీసీ నాయకులు తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ మైనారిటీ కార్యదర్శి రఫీయొద్దీన్ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పూల్ సింగ్, జొన్నల రాజు, గోకుల్ సాయిరాం, శ్రీను, ఏదుల్, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం, టీపీసీసీ చీఫ్ చిత్రపటాలకు పాలాభిషేకం



**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆలూర్ మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఇందిరమ్మ లబ్ధిదారులతో కలిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముక్కెర విజయ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ జనరల్ సెక్రెటరీ పోశెట్టి, నాయకులు మల్లారెడ్డి, నవనీత్, ఉదయ్, సంజీవ్, గంగారెడ్డి, శ్రీనివాస్, సాయి, శశి పాల్గొన్నారు.

## వాక్ వే గేట్‌లు ఏర్పాటు చేయాలి



**అక్షరటుడే, ఆర్మూర్ :** పట్టణంలోని ఆర్మూర్ ఆర్టీసీ డిపో వెనుక భాగంలో వాక్ వే గేట్‌లను ఏర్పాటు చేయాలని విద్యానగర్ కాలనీ అధ్యక్షుడు యమాద్రి భాస్కర్ అధికారులను కోరారు. ఈ మేరకు ఆర్టీసీ డీఎం రవి కుమార్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. డిపో చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్నారని.. వెనుక భాగంలో హౌసింగ్, మహాలక్ష్మి కాలనీ, విద్యానగర్ కాలనీతో పాటు స్కూళ్లు, ఆస్పత్రులు ఉన్నాయన్నారు. వీరికి ఇబ్బందులు కలుగకుండా బస్టాండ్‌లోకి వచ్చేందుకు వీలుగా వాక్ వే గేట్‌లను ఏర్పాటు చేయాలని డీఎంను కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

## లింగంపేట ఎస్సై, ఏఎస్సైకి సన్మానం

**అక్షరటుడే, లింగంపేట:** మండలానికి బదిలీపై వచ్చిన ఎస్సై దీపక్ కుమార్, ఏఎస్సై మధుసూదన్‌కు శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లింగంపేటలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దివిటి రమేష్, మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, గాండ్ల నర్సింలు, బండి నర్సింలు, బొల్లు శ్రీకాంత్, మల్లయ్య, రూప్ సింగ్, దాసరి పరువయ్య, వడ్ల రాజేంద్రప్రసాద్, మహేష్, సంపత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

**అక్షరటుడే, ఇందూరు:** వెల్‌నెస్ సెంటర్లలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మహాధర్నాకు సంఘీభావంగా ఆస్పత్రుల వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఔట్‌సోర్సింగ్ వ్యవస్థ రద్దుచేసి ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలని, లేదా ప్రత్యేక కార్పొరేషన్ ద్వారా జీతాలు చెల్లించాలని కోరారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ మెడికల్, హెల్త్ ఔట్‌సోర్సింగ్, కాంటాక్ట్ ఉద్యోగుల ట్రేడ్ యూనియన్, తెలంగాణ వెల్‌నెస్ కేంద్రాల ఉద్యోగుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రాజశేఖర్, వైద్యులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



## జాతీయ రహదారిపై దారి దోపిడీ..

**ట్రక్కులో నుంచి విలువైన మొబైల్స్ చోరీ**

**అక్షరటుడే, కామారెడ్డి:** దారి దోపిడీ దొంగలు రెచ్చిపోతున్నారు. తాజాగా టేక్రియాల్ జాతీయ రహదారిపై మొబైల్స్ లోడ్ తో వెళ్తున్న ఓ ట్రక్కులో నుంచి మొబైల్స్ బాక్సులను ఎత్తుకెళ్లారు. ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. మొబైల్స్ లోడుతో వెళ్తున్న ట్రక్కును డ్రైవరు శుక్రవారం రాత్రి రహదారిపై ఓ దాబా వద్ద నిలిపారు.

**సుమారు రూ. 10 లక్షల విలువైన..**

తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు ట్రక్కు తలుపులు తెరిచి రెండు మొబైల్ బాక్సులను ఎత్తుకెళ్లారు. వాటి విలువ సుమారుగా రూ.10 లక్షల వరకు ఉంటుందని సమాచారం. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. ఘటనాస్థలికి చేరుకుని ఆధారాల కోసం అన్వేషించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



## చెస్‌తో మేధోశక్తి పెరుగుతుంది

**అక్షరటుడే, ఇందూరు:** చెస్ ఆటతో మేధోశక్తి పెరుగుతుందని నవీపేట ఎంఈఓ అశోక్ తెలిపారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని అభ్యాస స్కూల్లో జిల్లాస్థాయి అండర్-13 బాలబాలికల చెస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో విజయం సాధించిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించాలని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రమేష్, లక్ష్మణ్, ఆర్బిటర్ వైభవ్ తదితరులు పాల్గొన్నారు.

**విజేతలు వీరే..** బాలుర విభాగంలో.. శివానంద్, సాయి రుద్ర. బాలికల విభాగంలో.. నాగ జోష్నిక, సహస్ర రాథోడ్ విజయం సాధించారు.

## కన్న కూతురిని అమ్మేసిన తల్లిదండ్రులు..

**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** ఆడపిల్ల అంటే అంగట్లో సరుకులా మారిపోయింది. నవమాసాలు మోసి కన్న కూతురిని తల్లి దండ్రులు అమ్మేసిన ఘటన నిజామాబాద్ నగరంలో కలకలం సృష్టించింది. వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నగరంలోని మిర్చి కాంపౌండ్‌కు చెందిన ముత్యాలమ్మ, వెంకట్‌రావులకు ఇప్పటికే నలుగురు సంతానం ఉన్నారు. కాగా.. జూన్ 30న ఐదో సంతానంగా ఆడపిల్ల జన్మనించింది. దీంతో శిశువును అమ్మకానికి పెట్టారు. స్థానికుల సహాయంతో సోలాపూర్‌కు చెందిన వ్యక్తికి రూ. 2 లక్షలకు విక్రయించారు. ఐదు రోజుల క్రితం అమ్మేయగా ఈ విషయం బయటకు పొక్కింది. దీంతో శుక్రవారం రాత్రి స్థానిక సీడీపీవో ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా.. చిన్నారిని రికవరీ చేసి సంరక్షణ గృహానికి తరలించినట్లు తెలిసింది.

## ఇసుక డంపులు స్వాధీనం



**అక్షరటుడే, కోటగిరి :** మండలంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సునీల్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొడిచెర్ల గ్రామంలో అక్రమంగా ఇసుక డంప్‌లు ఉన్నాయనే సమాచారంతో దాడులు చేశామన్నారు. డంప్‌లను స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులు అప్పగించినట్లు సూచించారు. ఇసుకను అక్రమ రవాణా చేస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు కృషి: ఎమ్మెల్యే భూపతిరెడ్డి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు నివాస యోగ్యమైన స్థలాలు ఇచ్చేందుకు సహకరిస్తానని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు జర్నలిస్టు నాయకులు ఎమ్మెల్యేను శనివారం కలిశారు. నగరానికి దూరంగా కాకుండా నగర పరిసరాల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. తన నియోజకవర్గ పరిధిలో అనువైన స్థలాలను గుర్తించి ఇళ్ల స్థలాలు ఇస్తామని ఎమ్మెల్యే భూపతిరెడ్డి హామీ ఇచ్చారు. 81 సర్వే నెంబరు స్థలాన్ని ఇవ్వాలని జర్నలిస్టులు కోరగా భూపతిరెడ్డి సానుకూలంగా స్పందించారు. అందరికీ ఇచ్చేందుకు వీలుగా నగర పొలిమేరలో ప్రభుత్వ ఖాళీ స్థలాలు గుర్తిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ఆర్డీవోకు ఆదేశాలు ఇస్తామని ఆయన చెప్పారు.

## విద్యుత్‌షాక్‌తో కౌలు రైతు మృతి

**అక్షరటుడే,గాంధారి:** మండలంలోని ముదెల్లి గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామంలోని రైతు మౌలానా బీ పొలాన్ని పోకల హన్మాండ్లు కౌలుకు తీసుకున్నాడు. అయితే శనివారం పొలంలోని స్టార్టర్ బాక్స్‌కు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో హన్మాండ్లు మరమ్మతులు చేసేందుకు బాక్స్‌ను తెరిచాడు. ఈ క్రమంలో విద్యుత్‌షాక్‌తో ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. హన్మాండ్లుకు భార్య శకుంతల, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై నర్సయ్య తెలిపారు.

## పేకాట స్థావరాలపై దాడులు

**అక్షరటుడే, కామారెడ్డి:** పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లితో పాటు మద్నూర్ మండలం లచ్చన్ గ్రామంలో పలువురు పేకాడుతున్నారన్న సమాచారం మేరకు శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. బ్రాహ్మణపల్లిలో 8 మందిని అరెస్ట్ చేయగా, వారి వద్ద నుంచి రూ.6,450 నగదు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. లచ్చన్ గ్రామంలో ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.6,390 నగదు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.